క్లుప్తంగా

స్వర్ణకు ప్రత్యామ్నాయాన్ని సాగు చేయండి

కాజులూరు: తొలకరిలో వరి సాగు చేసే రైతులు స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేయడం మంచిదని గొల్లపాలెం వీఏఏ వి.రమ్య అన్నారు. స్థానిక ఆర్బీకేలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండల గ్రామాల్లో అధికశాతం రైతులు తొలకరిలో స్వర్ణ రకం వంగడాన్ని సాగు చేస్తుంటారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎంటీయూ 1318 రకాన్ని తీసుకువచ్చారని ఇది పైరు ఆరోగ్యంగా పెరగటంతో పాటు బలమైన ఈదురు గాలులకు నేలకు పడిపోదన్నారు. దీని మార్కెట్ ధర 25 కేజీల బ్యాగ్ రూ.1194 కాగా ఆర్బీకేలో 150 సబ్సిడీ తగ్గించి రూ.1044కు అందిస్తున్నారన్నారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 20 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి పి.రత్నకుమారి గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ముగ్గురిని హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. సీజనల్ వ్యాధులు విజృంభించే కాలం నేపథ్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



నాగార్జునకు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేవాదళ్ సభ్యులు

రాయవరం: పసలపూడిలో ప్రమాదవశాత్తు గాయపడి కోలుకొంటున్న బాధితుడికి జనసేవాదళ్ తరఫున సోమవారం ఆర్థిక సాయం అందించారు. పసలపూడికి చెందిన ధూళి నాగార్జున ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడ్డాడు. మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ చొరవతో జనసేవాదళ్ సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేలు బాధితుడు నాగార్జునకు సంస్థ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన సేవాదళ్ సభ్యులు దాలిపర్తి శ్రీను, గొల్లపల్లి వెంకటరమణ, తలాటం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కోలో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

చైర్‌పర్సన్ దుర్గారాణి



టిడ్కో కాలనీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాణి

మండపేట: గొల్లపుంత రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల వద్ద ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అన్నారు. సోమవారం చైర్‌పర్సన్ దుర్గారాణి టిడ్కోకాలనీని కమిషనర్ బొడ్డేపల్లి రాముతో కలిసి సందర్శించారు. నాలుగు రోజులు క్రితం నుంచి టిడ్కో గృహాల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆమె పరిశీలించారు. మున్సిపల్ అధికారులు పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పూల మొక్కలు, కూరగాయల మొక్కలు, పొదుల వంటివి పెంచితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని ఆమె సూచించారు. దీనికి కాలనీ వాసులు కూడా సహకరించాలని కోరారు. పరిశుభ్రత విషయంలో అందరూ బాధ్యత వహిస్తేనే పరిసరాలు బాగుంటాయని పేర్కొన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, టిడ్కో సిబ్బంది బిందు మాధవి, సచివాలయ సెక్రెటరీలు, శానిటేషన్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో 21, 22, 23 తేదీల్లో గరికపాటి ప్రవచనాలు

మండపేట: ఆధ్యాత్మిక వేత్త గరికపాటి నరసింహారావు మండపేట రానున్నారు. స్థానిక ధర్మగుండం చెరువు వద్ద ఉన్న రామాలయం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామా కమ్యూనిటీ హాలులో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆయన ప్రవచనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో శివతత్త్వంపై గరికపాటి ప్రవచనాలు వుంటాయని చెప్పారు. ఈ మూడు రోజులు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రవచనాలు చెబుతారని తెలిపారు.

వరదలపై ముందస్తు చర్యలు

- పక్కా ప్రణాళికను రూపొందించిన అధికారులు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో చర్యలు
- కపిలేశ్వరపురం, కోటిపల్లి ఫ్లడ్ స్టోర్‌లలో తగిన సామగ్రి నిల్వ



కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో సమకూర్చిన సామగ్రి



అద్దంకివారిలంక వ్యవసాయ క్షేత్రంలో వరద నీటిలో చిక్కుకున్న పశువులు (ఫైల్)

కపిలేశ్వరపురం: వర్షాకాలం వచ్చింది. తరచూ వానలు పడుతూ ఉంటాయి. పరిస్థితి తీవ్రతను బట్టి వరదలు సంభవించే అవకాశాలుంటాయి. వరదల ప్రభావానికి రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని లంక గ్రామాల ప్రజలు అవస్థపడుతుంటారు. నిండు గోదావరిలో తేలియాడుతూ రెండు నుంచి మూడు రోజులు పాటు గ్రామంలోనే ఉండిపోతుంటారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండు నెలల కింద వరదలపై ముందస్తు చర్యలపై సన్నాహక సమావేశం నిర్వహించింది. హెడ్‌వర్క్స్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో చర్చించి వరప ప్రభావిత గ్రామాల పరిస్థితిని సమీక్షించింది. కపిలేశ్వరపురం, కోటిపల్లి ఫ్లడ్ స్టోర్లలో తగిన సామగ్రిని సమకూర్చారు. అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాకాలంలో గోదావరి నీటి ప్రభావాల తీరుపై ఈ కథనం...

లంక గ్రామాల పరిస్థితి ఇలా..

రామచంద్రపురం నియోజకవర్గం కె.గంవరం మండలం శేరిలంక, మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలంలో కేదారిలంక పంచాయతీ పరిధిలో శేరిగూడెం, వీధివారిలంక, కపిలేశ్వరపురం గ్రామ పరిధిలో నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామ పరిధిలో పల్లపులంక, కోరుమిల్లిలంక గ్రామాలు దాదాపు గోదావరి నదిలో ఉన్నాయి. ఇవి కాకుండా కె.గంగవరం మండలం పరిధిలో కూళ్ల, మల్లవరం, సుందరపల్లి, కోటిపల్లి, గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ వరదల వేళ ఇబ్బందులను ఎదుర్కొంటాయి. మండల కేంద్రమైన కపిలేశ్వరపురానికి గోదావరి అవతలి వడ్డున సుమారు 25 నుంచి 40 కిలోమీటర్లు దూరంలో కేదారిలంక, అద్దంకివారిలంక శివారు గ్రామాలు ఉండడంతో వరదల సమయంలో పాలనాపరమైన సమస్యలు ఎదురవుతుంటాయి. అక్కడి వ్యవసాయ క్షేత్రాలు, నివాస ప్రాంతాలు ముంపు బారి పడతాయి. సాయంమందించేందుకు కపిలేశ్వరపురం నుంచి పడవల్లో ఆహార పదార్థాలను అధికారులు తరలిస్తుంటారు.

ఫ్లడ్ స్టోర్‌లను సిద్ధం చేసిన అధికారులు

గోదావరి గట్లు బలహీన పడినప్పుడు పటిష్ఠపర్చేందుకు ఇసుక, సంచులు, బారీగేటు కర్రలు, గడ్డపారలు, పారలు ఇతర సామగ్రి అవసరమవుతుంది. కపిలేశ్వరపురం, కోటిపల్లిలలో రెండు ఫ్లడ్ స్టోర్‌లున్నాయియ. కపిలేశ్వరపురం ఫ్లడ్ స్టోర్‌లో ఇప్పటికే ప్రభుత్వం సరుకులను సమకూర్చింది. 1,000 సర్వేబాదులు, 2,800 వెదురుబాదులు, 40 వేల సంచులు, 370 క్యూబిక్ మీటర్లు ఇసుక, కత్తులు, పారలు, గొడ్డళ్లను సిద్ధం చేశారు. గ్రామాల్లో వరదనీటి పరిస్థితులపై పంచాయతీ, రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులను ప్రభుత్వం ఇప్పటికే అప్రమత్తం చేసింది.

సకాలంలో చర్యలు

వరదలు నేపథ్యంలో గత ఏడాది లంక గ్రామాల్లో అధికారులు సకాలంలో పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. దాంతో వరద నష్ట ప్రభావం తీవ్రతరం కాకుండా సద్దుమణిగింది. ఈ ఏడాది కూడా అదే తరహాలో అధికారులు కృషి చేస్తారని ఆశిస్తున్నాం.

– వీధి వెంకటరెడ్డి, సర్పంచ్, కేదారిలంక



వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం



ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఫ్లడ్ స్టోర్‌లో తగిన సామగ్రిని సమకూర్చాం. వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం.

– ఆర్.విశ్వనాథరాజు, హెడ్ వర్క్స్ ఏఈ

వెలంపాలెం విద్యార్థికి ఐఐటీలో ర్యాంకు



సలాది సుచిత్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం గ్రామానికి చెందిన సలాది సుచిత్ 2024 జేఈఈ పరీక్షలో ఆల్ ఇండియా ఐఐటీ 1522వ ర్యాంకు సాధించాడు. సుచిత్ ఇంటర్మీడియెట్ కాకినాడ గంగరాజు నగర్ ఆదిత్య జూనియర్ కళాశాలలో చదివాడు. ఇంటర్మీడియెట్‌లో సీబీఎస్ఈ సిలబస్‌లో 500 మార్కులకు 467 మార్కులు సాధించాడు. సుచిత్ తాత సలాది వీవీ సత్యనారాయణమూర్తి విశ్రాంత ఉపాధ్యాయుడు కాగా, తండ్రి శ్రీనివాస్ తుని మండలం టి. తిమ్మాపురంలో జెడ్పీ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థి సుచిత్‌ను పలువురు అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించండి

అంబాజీపేట: పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభించిన ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని హెచ్‌ఎం కేఎస్ కనకదుర్గ అన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఎంపీసీ ఆరుగురు, సీఈసీ ముగ్గురు విద్యార్థులు కళాశాలలో చేరార న్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉంటాయని, నాణ్యమైన విద్యనందించే లెక్చరర్లను ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్యేను కలసిన నాయకులు



ఎమ్మెల్యే సుభాష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న జనసేన నాయకులు

కె.గంగవరం: రామచంద్రపురం కూటమి ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌ను సోమవారం సత్యవాడ గ్రామానికి చెందిన జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సుభాష్‌ను కలసిన జనసేన నాయకులు మాట్లాడుతూ కాపు, శెట్టిబలిజ సామాజిక వర్గాలను సమన్వయంగా చేసుకుని పరిపాలన కొనసాగించాలని కోరారు. నేటి యువతకు యువ ఎమ్మెల్యే సుభాష్ ఆదర్శమని గ్రామాభివృద్ధికి సహకరించి ప్రజల మన్ననలు పొందాలని వారు కోరారు. జనసేన నాయకులు సలాది ప్రకాష్, తోట వెంకన్న, సలాది వెర్రిబాబు, ఎంపీటీసీ బండారు చిన్నబాబు, సలాది దానయ్య తదితర పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిని అరెస్ట్ చేయాలి



పెయ్యల రాంబాబు

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి పెయ్యల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడంతో పాటు మాల కులాన్ని కించపరుస్తూ చెప్పుకోవడానికి వీలులేని పదజాలంతో లేఖ రాసి ఆయన విగ్రహం చేతికి వేలాడ దీసిన సంఘటన జరిగి రెండు రోజులయిందన్నారు. 24 గంటల్లో నిందితులను అరెస్ట్ చేస్తామన్న పోలీసులు ఎవరినీ ఇంత వరకు అరెస్ట్ చేయకపోవడం తప్పు పట్టారు. దీనికి కారణమైన వారిని పోలీసులు తక్షణం అరెస్ట్ చేయకపోతే నియోజకవర్గంలోని ప్రతి అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో ఆందోళనకు దిగుతామని రాంబాబు తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

కాజులూరు: కె.గంగవరం మండలం యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దుండగులను ప్రభుత్వం, పోలీసులు కఠినంగా శిక్షించాలని మండలంలోని వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు బీసీ, ఎస్సీ సామాజికవర్గ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పి.సుబ్రహ్మణ్యం, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, దుగ్గుదుర్రు మాజీ ఎంపీటీసీ మాత నూకరావు, పోతు శ్రీనివాసు తదితరులు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానించటం క్షమించరాని నేరమన్నారు. దోషులను పోలీసులు త్వరితగతిన పట్టుకుని సమస్యను పరిష్కరించాలన్నారు.

మార్కెట్ కమిటీ పదవికి రాజీనామా



రాజీనామా లేఖను సమర్పిస్తున్న సింహాచలం, డైరెక్టర్లు

మండపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి నక్కా సింహాచలం సోమవారం రాజీనామా చేశారు. ఆయనతో పాటు డైరెక్టర్లు కొప్పిరెడ్డి పద్మావతి, కనికెళ్ల పల్లవి కూడా రాజీనామా చేసినట్టు తెలిపారు. తన రాజీనామాను మార్కెట్ కమిటీ కార్యదర్శి సుబ్బరాజుకు అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ఓటమి చెందిన కారణంగా తాము నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్టు తెలిపారు. అదే విధంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్ కూడా రాజీనామా చేశారు. తన రాజీనామ లేఖను మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శికి, మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు పంపినట్టు ఆయన పేర్కొన్నారు.

13న మండపేటలో ఐఎఫ్‌టీయూ ఆంధ్ర రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో ఎఫ్‌టీయూ నాయకులు

మండపేట: మండపేట పట్టణంలో ఈ నెల 13వ తేదీన ఐఎఫ్‌టీయూ ఆంధ్ర రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం జరపనున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు కోరారు. ఏడిద రోడ్ లోని ఆర్టీసీ బస్టాండులో సోమవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయకుడు బి.సిద్ధూ, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా దేశంలో కార్మిక వర్గాన్ని పోరాట మార్గంలో నడిపిస్తూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొందన్నారు. అనేక మంది నాయకులను విప్లవోద్యమంలో కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాన్ని ఈ వ్యవస్థ మార్పునకు శోధక శక్తిగా మలిచే క్రమంలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ మండపేట పట్టణంలోనీ నాళం వారి సత్రంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జనరల్ కౌన్సిల్‌కు రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు కష్టజీవులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట రైస్ మిల్లు జట్టు నాయకులు కే సూరిబాబు, కే సత్తిబాబు, కే అన్నవరం, జీ నాగు, పీ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

మండపేట: నాలుగో సారి ఎమ్మెల్యేగా భారీ విజయంతో గెలుపొందిన వేగుళ్ల జోగేశ్వరరావుకు ఈసారి ఏర్పడే కూటమి ప్రభుత్వంలోని మంత్రివర్గంలో స్థానం కల్పించాలని టీడీపీ నాయకులు కోరారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాదరావు మాట్లాడుతూ జోగేశ్వరరావు తండ్రి సర్దార్ వేగుళ్ల వీర్రాజు మండపేట మున్సిపాలిటీ చైర్మన్‌గా సుమారు ఐదు సార్లు కొనసాగారని, జోగేశ్వరరావు వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని, ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. పాలచర్ల శిరీష్, కొవ్వాడ అప్పన్న బాబు, నెల్లిపూడి సత్యనారాయణ, బెవర తాతారావు, చుండ్రు సోమరాజు, కాశిన కాశీవిశ్వనాథం, శ్రీనివాస్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అది ఓ మధురానుభూతి..

- మళ్లీ రైలు కారు కనబడేనా..?
- ఒక్కసారైనా.. ఎక్కి తీరాల్సిందే...



కాకినాడ-కోటిపల్లి రైల్వే లైన్‌లో రైలు కారు (ఫైల్)

రామచంద్రపురం: చుట్టూ చెట్లు... పచ్చటి పొలాల మధ్యన శ్రమించే రైతన్నలు పశువులు, గొర్రెలు, మేకలను మేపే కాపరులు పొలం పనులకు వెళ్లే పల్ల ఆడపడుచులు ... చెంగు చెంగున గంతులేసే లేగ దూడలు ఇలా అద్భుతమైన, కనులారా వీక్షించే దృశ్యాలు ఎన్నో.. ఈ మరపురాని మధురానుభూతులను చూడాలంటే కాకినాడ– కోటిపల్లి రైల్వే లైన్‌లో ఈ రైలు కారు ప్రయాణం ఒకప్పుడు ఉండేది. కాకినాడ నుంచి కోనసీమకు రైల్వే లైన్‌లో భాగంగా 2001లో కోటిపల్లి వరకు రైల్వేలైన్‌ను పూర్తి చేసి రైల్ సర్వీసును ప్రారంభించారు. అనంతరం రెండేళ్ల తరువాత కాకినాడ, కోటిపల్లి రైలును ఆ శాఖ అధికారులు నడిపారు. అయితే నష్టాలు వస్తుందని రైలును నిలిపివేశారు. 2003 నుంచి ఇదేలైన్‌లో రైల్ కారును ప్రవేశపెట్టారు. విశాఖ రీజియన్‌లోని రైల్వే లైన్లలో కాకినాడ– కోటిపల్లి రైల్వే లైన్లో నడుపుతున్న ఒకే ఒక రైలు కారు సర్వీసు ఇక్కడ ఉండేది. జిల్లాలోని వేసవి వినోదం కోసం వచ్చేవారి కోసం అన్నట్లుగా ఈ రైలు కారు ప్రయాణం ఆహ్లాదకరంగా సాగేంది. ప్రకృతి సోయగాలు, పల్లెటూళ్లను తాకుతూ వెల్లే ఈ రైలు ప్రయాణం ఒక్కసారైనా చేయాల్సిందేనని అప్పట్లో అనిపించేది. అప్పట్లో కాకినాడలో ఉదయం 10 గంటలకు బయలుదేరి కరప, కూరాడ, వేళంగి, ఓదూరు, రామచంద్రపురం మీదుగా 11.30కు కోటిపల్లి చేరుకునే గంటన్నర ప్రయాణం ఇట్టే ముగిసిందా అన్నట్టు ఈ రైలు కారు ప్రయాణం ఒక మధురానుభూతిని కలిగించేంది. తిరిగి ఇదే రైలు కారు కోటిపల్లి నుంచి కాకినాడకు చేరుకుంటుంది. రోజుకు ఒక్కసారి మాత్రం ఈ రూటులో ఈ ఒక్క రైలు కారు మాత్రమే తిరగటం విశేషం. ప్రతి స్టేషన్ దగ్గర ఆగటం.. రైలు కారులో ప్రయాణించే సిబ్బందే రైలు గేట్లు వేసుకోవటం... తిరిగి రైలు వెళ్లిన తరువాత గేట్లు తీయటం ఈ రైలు కారు స్పెషల్. స్టేషన్‌లో కాకుండా రైలు కారులోనే టిక్కెట్లు తీసుకోవటం ఇలా ఎన్నో అనుభూతులు మిగిల్చింది. కానీ సుమారుగా ఆరేళ్ల క్రితం ఈ రైలు కారును రైల్వే అధికారులు నిలిపివేశారు. కాకినాడ నుంచి కోటిపల్లి వరకు తిరిగే రైలు కారు ప్రయాణం అప్పట్లో అదే లైన్‌లో ఉండే ఎన్నో పల్లెటూళ్లు కనిపిస్తూ చుట్టు వచ్చేసిన అనుభూతిని కలిగించేది. రైల్వే లైన్ ఏర్పాటై సుమారుగా 24 సంవత్సరాలు కావస్తున్నా.. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రైలు కూయలేదు. కోటిపల్లి వద్ద గోదావరి నదిపై గత అయిదేళ్ల కాలంగా రైలు వంతెనకు సంబంధించి పిల్లర్లను గోదావరి నదిలో పూర్తి అయినా వంతెన మాత్రం ఇంకా పూర్తి కాలేదు. రైలు పూర్తి స్థాయిలో నడిచే వరకైనా గతంలో నడిపిన రైలు కారును ఈ సారైనా నడపాలని ప్రజలు కోరుతున్నారు. కేంద్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

వామ్మో పిడుగు .. తస్మాత్ జాగ్రత్త

- వర్షాకాలంలో పొంచి ఉన్న ముప్పు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



పిడుగు పడుతున్న దృశ్యం (ఫైల్)

అంబాజీపేట: వర్షాకాలం వచ్చిందంటే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగు ఎప్పుడు పడుతుందో, ఎలా పడుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదాలు వాటిల్లి ఒక్కోసారి ప్రాణ నష్టం కలుగుతుంది. మెరుపుల ధాటికి గృహోపకరణాలు కాలిపోతూ ఉంటాయి. పిడుగులోని కాంతి ప్రభావంతో నష్టం భారీగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పిడుగు నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో హెచ్చరికలు జారీ చేస్తుంది. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. అంటే వాతావరణంలో చోటు చేసుకున్న పరిణామాలతో ఒక్కసారిగా ఆకాశమంతా మేఘావృతమై మెరుపు వేగంతో విద్యుత్ కాంతి తీగ రూపంలో నేలకు చేరుకుంటుంది. ఒక్కసారిగా విద్యుదావేశం పెరిగి మేఘాల సమీపంలో వ్యతిరేక విద్యుదావేశం ఉన్నప్పుడు వాతావరణంలోని తేమ, దుమ్ము కారణంగా వాటిలోని స్థిర విద్యుత్ భూమి వైపు ప్రవహిస్తుంది. ఒక మిల్లీ సెకన్ కాలంలో మెరుపుతో కూడిన పిడుగు 20 వేల ఆంపియర్ల విద్యుత్ ప్రవాహాన్ని విడుదల చేస్తుంది. అప్పుడు ఏర్పడే విద్యుత్ క్షేత్ర తీవ్రత మీటరుకు 2 లక్షల ఓల్టులతో సమానం. ఇది భూమి నుంచి 1 నుంచి 2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 2 మేఘాల మధ్య అయితే 7 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మెరుపులు భూమి మీద పడినప్పుడు వస్తువులను బట్టి నష్ట తీవ్రత ఉంటుంది.

కాపర్ ఎర్త్ ఏర్పాటుతో ప్రమాదానికి చెక్

పిడుగు పాటు నుంచి తప్పించుకునేందుకు ఎత్తైన ప్రదేశం నుంచి నేరుగా భూమిలోకి కాపర్ ఎర్త్ (రాగి వైరును అనుసంధానం చేస్తూ భూమిలోకి పాతాలి) ఏర్పాటు చేయడం ద్వారా దాదాపు కిలోమీటరు దూరంలో పడిన పిడుగును నేరుగా భూమిలోకి ఇదే ఆకర్షించుకుంటుంది. ఎర్త్ వైర్‌ను ఉప్పు, కర్బూర బొగ్గు, నీటి మిశ్రమాలతో రాగి వైరు కలిగిన రాడ్ను భూమి లోపలికి ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ఎత్తైన టవర్లు ఏర్పాటు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించడంతో పిడుగుపాటు నుంచి తప్పించుకునే అవకాశం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు

వర్షం వచ్చేటప్పుడు చెట్ల కింద ఉండకూడదు. ముఖ్యంగా ఎత్తైన చెట్టు కింద అస్సలు ఉండకూడదు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వస్తే రైతులు పొలాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదు. లక్షల డిగ్రీల ఉష్ణోగ్రతతో విడుదలయ్యే వేడి ఒక్కసారిగా మనిషిని చేరగానే గుండెపై ప్రభావం చూపుతుంది. వర్షపు సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోల్టులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర లేకుండా చూసుకోవాలి. లేకుంటే రేడియేషన్ తరంగాలకు గురై ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకరణాలు కాలిపోయే అవకాశం ఉంది. ఆ సమయంలో టీవీలకు ఉన్న విద్యుత్ కేబుల్ కనెక్షన్ తొలగించాలి. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. తడి ప్రదేశాల్లో ఉండకపోవడం చాలా మంచిది.

టేకి మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఏఎంఓ

కపిలేశ్వరపురం: టేకి బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల మోడల్ స్కూల్‌గా ఎంపికైంది. జిల్లాలోని టేకి పాఠశాలలో మెరుగైన విద్యాబోధన విద్యార్థులకు అందించేందుకు కృషి చేయనున్నారు. పాఠశాలను సర్వశిక్షాభియాన్ జిల్లా అకాడమిక్ మోనటరింగ్ అధికారి పిల్లి రాంబాబు సందర్శించారు. 13న పాఠశాలను తెరవనున్న నేపథ్యంలో పరిశీలించేందుకు వచ్చినట్టు రాంబాబు తెలిపారు. విద్యాబోధన చేసే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే ప్రాంగణంలో ఉండటం తదతర కారణాలు నేపథ్యంలో టేకి ప్రాథమిక పాఠశాలను మోడల్ పాఠశాలగా ఉన్నతాధికారులు ఎంపిక చేశారన్నారు.